


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -52 శుక్రవారం 24 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు 6 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# బిఆర్ఎస్, బిజెపిలు రెండూ ఒక్కటే

**మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి**





**ప్రధాన్ రాజీనామాను ఎందుకు డిమాండ్ చేయడం లేదు?**

**అందుకే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం**

**ఓటు లేకపోతే పథకాలు పోతాయని హెచ్చరిక**

**గ్లోబరీనా ముమ్మాటికీకేటీఆర్ బినామీ సంస్థ**

**గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది బలి**

**పేరు మార్చుకుని పరీక్షల కాంట్రాక్ట్ పొందింది**

**గ్లోబరీనా తప్పిదాలకు కెటిఆర్ క్షమాపణలు చెప్పాలి**

**హైదరాబాద్,జులై 23(జర్నలిస్ట్ వార్త)):**
గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు ఆరోపించారు. గురువారం మీడియాతో నిర్వహించి చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది చనిపోయారని.. ఆ సంస్థ పేరు

మిగతా 2లో.

## పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ఫాస్ట్-ట్రాక్ కోర్టు

**ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని మోడీ**




**కొత్త యాంటీ-చీటింగ్ చట్టం కింద పేపర్ లీకేజీ కేసుల విచారణ**

**దోషులుగా తేలితే 5 ఏళ్ల జైలు, రూ.10 లక్షల వరకు జరిమానా**

**తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కోర్టుల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం**

**యువత భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టేది లేదన్న మోదీ**

**న్యూఢిల్లీ,జులై 23(జర్నలిస్ట్ వార్త)):**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా, వేగంగా న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఫాస్ట్-ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. నీట్ పేపర్ లీకేజీ కేసులో

మిగతా 2లో.

## ఎల్‌నినోతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం

**అధికారులతో మంత్రి పొన్నం సమిక్ష**

**కార్యాచరణతో ముందుకు సాగాలని సూచన**



**సిద్దిపేట,జులై 23(జర్నలిస్ట్ వార్త)):**
ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. దీనినుంచి బయటపడేలా కార్యాచరణతో సాగాలని అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఐఓసీ కార్యాలయంలో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఎల్‌నినో ప్రభావంపై మంత్రి పొన్నం ప్రభాకర్

మిగతా 2లో.

## చేనేత కుటుంబాలకు ఏటా రూ.25వేలు

**గోదావరి పుష్కరాలకు రూ.50 కోట్లు మంజూరు**

**కొత్తగా నేతన్నల సేవలో పథకం అమలు**

**భీమవరంలో తొలి మహిళా ప్రైవేట్ వర్సిటీ ఏర్పాటు**


**మార్క్‌ఫెడ్‌కు రూ.300 కోట్ల రుణానికి ప్రభుత్వం గ్యారంటీ**

**భోగాపురం విమానాశ్రయం పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చ**

**కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి**

**అమరావతి,జులై 23(జర్నలిస్ట్ వార్త)):**
గోదావరి పుష్కరాల సమర్థ నిర్వహణకు రూ.50 కోట్లు మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. 'నేతన్నల సేవలో' పథకం అమలుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసిందని చెప్పారు. ఈ పథకం కింద చేనేత కుటుంబాలకు ఏటా రూ.25వేల ఆర్థికసాయం అందించనున్నట్లు వివరించారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను మీడియాకు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో మొదటి ప్రైవేటు మహిళా యూనివర్సిటీ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. భీమవరంలో విష్ణు ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ పేరిట దీన్ని

మిగతా 2లో.




## విద్యార్థులపక్షాన మేంఉన్నాం

**: గాంధీ స్మృతి వద్ద రాహుల్ గాంధీ నిరసన దీక్ష**

**నీట్-యూజీ 2026 పేపర్ లీక్ బాధితులకు విపక్షాల మద్దతు**

**గాంధీ స్మృతి వద్ద రాహుల్ గాంధీ నేతృత్వంలో నిరసన కార్యక్రమం**

**మొబైల్ ఫ్లాష్‌లైట్లతో విద్యార్థులకు సంఘీభావం తెలిపిన ఎంపీలు**

**కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్**

**విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం**



2లో.

## మన ఎర్రచందనాన్ని దేశంలో ఎక్కడ దాచినా వదలొద్దు

**ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలని అధికారులకు పవన్ ఆదేశం**

**స్మగ్లర్లతో పాటు కింగ్ పిన్‌లపైనా కఠిన చర్యలు తీసుకోవాలని సూచన**

**నిఘా కోసం డ్రోన్లు, ఆధునిక టెక్నాలజీ వినియోగించాలని దిశానిర్దేశం**

**గత రెండేళ్లలో 1239 మంది అరెస్ట్, 12 మందిపై పీడీ చట్టం ప్రయోగం**

**స్మగ్లింగ్ కేసుల్లో 95 శాతానికి పెరిగిన శిక్షల రేటు అని తెలిపిన అధికారులు**

**అమరావతి,జులై 23(జర్నలిస్ట్ వార్త)):**
రాష్ట్రంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను సమూలంగా నిర్మూలించాలని, అక్రమ రవాణాపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అత్యంత కఠినంగా అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి చెందిన

మిగతా 2లో.





## సీఎం రేవంత్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు..

**48 గంటల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**గ్లోబరీనా టెక్నాలజీస్‌పై చేసిన ఆరోపణలపై వివాదం**

**48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**లేదంటే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక**

**హైదరాబాద్,జులై 23(జర్నలిస్ట్ వార్త)):**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లీగల్ నోటీసు పంపారు. గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థతో తనకు సంబంధాలు ఉన్నాయంటూ చేసిన ఆరోపణలపై 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పరువు నష్టం

మిగతా 2లో.

## విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్‌లు

**నాణ్యతలో రాజీపడకుండా సరఫరా**

**క్యూర్ పరిధిలో మంచినీటి ప్రణాళికలు**

**అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,జులై 23(జర్నలిస్ట్ వార్త)):**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే యూనిఫామ్‌ల నాణ్యతలో రాజీపడబోమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పంపిణీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల యూనిఫామ్‌లపై అధికారులతో సీఎం సమీక్షించారు.
విద్యార్థుల యూనిఫామ్‌లు త్వరగా సరఫరా చేసేలా సంస్థలపై ఒత్తిడి తేవాలి. ఆగస్ట్ 15 నాటికి విద్యార్థులకు వాటిని అందించాలన్నారు. ఆ తర్వాత ప్రతి విద్యార్థి నుంచి అభిప్రాయాన్ని సేకరించాలి. ఆ అభిప్రాయాల ఆధారంగా వచ్చే ఏడాది యూనిఫామ్‌లు పంపిణీ చేయాలి. గత ప్రభుత్వ హయాంలో ఈ విషయంలో అడ్డగోలుగా

మిగతా 2లో.



# బిఆర్ఎస్, బిజెపిలు రెండూ ఒక్కటే

**మొదటిపేజీ తరువాయి**

మార్చుకొని పరీక్షల కాంట్రాక్టు పొందిందని వ్యాఖ్యానించారు. వీటి ఆధారంగానే నీట్ కుంభకోణం జరిగిందన్నారు. గ్లోబరీనా తప్పిదాలపై కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ ముక్కు నేలకు రాయాలన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత కేటీఆర్, బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.కేటీఆర్ బర్త్ డే పై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కేటీఆర్ పుట్టిన రోజు దావత్ ఇస్తాడో అడగాలి. కేటీఆర్ ఇచ్చే దావత్ నేను తీసుకోలేనేమో. ఆయనవి అన్నీ వేరే పార్టీలు' అంటూ సెటైర్ విసిరారు. హరీశ్ గొప్పవాడైతే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. అతి తెలివి తేటలతో ఏదిపడితే అది మాట్లాడతానంటే నడవదని హరీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు కన్నెపెల్లి పంపు హౌజ్ గురించి మాట్లాడుతున్నారని... మేడిగడ్డ గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ గురించి మాట్లాడితే ప్రజలు చెప్పుతో కొడతారని మండిపడ్డారు. మేడిగడ్డ కట్టింది, కూల్చింది బీఆర్ఎస్ వాళ్లే అని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ అయిపోయే వరకూ ఎమ్మెల్యేలను గ్రామాల్లోనే ఉండమని చెప్పానని ముఖ్యమంత్రి అన్నారు. సర్ నాయకులకు సంబంధించింది కాదని, ప్రజలకు సంబంధించిందని స్పష్టం చేశారు. 'తెలిసీ తెలియక నాకు రెండు ఓట్లు ఉన్నాయని అంటున్నారు. కలెక్టర్ అనుమతి తీసుకొని నా గ్రామంలో ఉన్న ఓటును కొడంగల్‌కు మార్చుకున్నాను. గతంలో కొడంగల్ ప్రాంతం కర్ణాటకలోని జిల్లాలో ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు చేసినప్పుడు కొడంగల్ పాలమూరులోకి వచ్చిందని చెప్పారు. బీజేపీ కుట్రపూరితంగా ఓట్లను తొలగించే అవకాశముందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతంలో అమాయకుల ఓట్లు పోయే అవకాశముందన్నారు. సర్ ఉద్దేశం ప్రక్షాళన అని.. కుట్ర పూరితంగా సర్‌ను వాడుతున్నారని ఆరోపించారు. సర్ పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే అని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు పోతే.. కాంగ్రెస్ ఓట్లు పోయినట్టే అని అన్నారు. అవగాహన లేకపోవడం, సరైన సమయంలో స్పందించకపోవడం వల్ల ఓట్లు పోయే అవకాశముందన్నారు. 'ఓటుహక్కు లేకపోతే పథకాలు పోతాయి.. ఓటుహక్కు లేకపోతే ఆధార్ పోతుంది. ఓటుహక్కు లేకపోతే గుర్తింపే ఉండదు... ఓటుహక్కు లేకపోతే సంక్షేమం రాదు' అని అన్నారు.

బీజేపీలో అంతర్గత కలహాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ నాయకులకు ఒకరంటే ఒకరికి పడదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు ఎక్కడుంటాయో బీజేపీకి తెలుసని వెల్లడించారు. చిన్నచిన్న కారణాలతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు 5 లక్షలు ఇవ్వాలని డిసైడ్ అయిందని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు.. బ్రోకర్లకు అమ్ముకొని దళారీ వ్యవస్థ తెచ్చారని మండిపడ్డారు. 'మేం ఏం చేస్తున్నామో అదే చెప్తున్నాం' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఎస్ఐఆర్ పూర్తయిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రక్షాళన పేరుతో ఓట్లు తొలగించే అవకాశం ఉందని.. అలా జరగకుండా ఉండేందుకు బీఎల్‌వోలను పెట్టామన్నారు. ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయని సీఎం ప్రశ్నించారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ఆంధ్ర ఓట్లన్నీ తొలగించారు. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళితే.. జీహెచ్ఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా బాగా పనిచేస్తోంది.. చాలా ఆస్తులు స్వాధీనం చేసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి పాల్పడినందుకే హరీశ్‌రావుకు కొన్నాళ్లు మంత్రి పదవి ఇవ్వకుండా కేసీఆర్ పక్కన పెట్టారు. గత ప్రభుత్వంలో ఇంటర్ పేపర్ల మూల్యాంకనంలో జరిగిన తప్పిదాలతో 27 మంది విద్యార్థులు బలయ్యారు. గ్లోబరీనా సంస్థ విషయంలో కేటీఆర్ నిజాయతీ నిరూపించుకోవాలన్నారు. విద్యార్థుల మృతికి కారణమైన ఆయన క్షమాపణ చెప్పాలి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయలేదని అన్నారు. పేదలకు ఇచ్చే ఇళ్లను బీఆర్ఎస్ నేతలు దళారులకు అమ్ముకున్నారు. జన్వాడ ఫాంహౌస్ భూములపై కేటీఆర్ విచారణ కోరాలి. మేం అధికారంలోకి వచ్చాకే ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌ను తిరిగి ఓపెన్ చేశాం. నాడు వాళ్లు మూసిన ధర్నా చౌక్‌లోనే కేటీఆర్ ధర్నా చేస్తామంటున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు.

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు..

**మొదటిపేజీ తరువాయి**

దావాతో పాటు సివిల్, క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని కేటీఆర్ తన నోటీసులో పేర్కొన్నారు. గ్లోబరీనా సంస్థలో తనకు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు, యాజమాన్య హక్కులు లేదా బినామీ ప్రయోజనాలు లేవని ఆయన స్పష్టం చేశారు. సదరు సంస్థ తన బినామీ అని, సీబీఎస్ఈ కాంట్రాక్టులు ఇప్పించానని చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు.

రాష్ట్రంలో అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి, రాజకీయ ప్రత్యర్థిపై ఇటువంటి నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని కేటీఆర్ పేర్కొన్నారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే రాజకీయ దురుద్దేశంతోనే రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారని ఆయన ఆరోపించారు.ం

## పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ఫాస్ట్-ట్రాక్ కోర్టు

**మొదటిపేజీ తరువాయి**

నిందితులను కొత్తగా తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్-2024' కింద విచారించనున్నారు.ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చట్టం కింద దోషులుగా తేలిన వారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ కేసుల విచారణ కోసం తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. బాంబే, కలకత్తా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ హైకోర్టుల పరిధిలో ఈ ప్రత్యేక కోర్టులు పనిచేయనున్నాయి. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న నాలుగు కేసులను ఈ ఫాస్ట్-ట్రాక్ కోర్టులకు బదిలీ చేయనున్నారు.నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి ఈ కొత్త చట్టం కింద ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసులు బాంబే హైకోర్టు పరిధిలోకి వస్తాయి. ఈ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను, హైకోర్టులను కేంద్రం అధికారికంగా కోరనుంది. రోజువారీ విచారణ జరిపి, కేసులను త్వరగా పరిష్కరించాలని ఈ అభ్యర్థనలో పేర్కొననుంది.నీట్‌తో పాటు యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్ వంటి ఇతర పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పేపర్ లీకేజీలు కూడా ఈ కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి.అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. యువత భవిష్యత్తు, సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. "యువత భవిష్యత్తును దెబ్బతీయాలని ప్రయత్నించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. దోషులకు కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## మన ఎర్రచందనాన్ని దేశంలో ఎక్కడ దాచినా వదలొద్దు

**మొదటిపేజీ తరువాయి**

ఎర్రచందనాన్ని దేశంలో ఏ మూలన దాచిపెట్టినా వదలొద్దని, స్మగ్లర్లతో పాటు వారి వెనుకున్న కింగ్ పిన్‌లపైనా ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ప్రత్యేకమైన అటవీ సంపద ఎర్రచందనం. దీనిని కాపాడుకోవడం మనందరి బాధ్యత. ఎర్రచందనం స్మగ్లింగ్‌పై కూటమి ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుంది. నిఘాను పటిష్ఠం చేసేందుకు డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. స్మగ్లింగ్ ముఠాల నెట్‌వర్క్‌ను మూలాలతో సహా పెకిలించాలి" అని అన్నారు. ఇతర రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖ అధికారులతో తక్షణమే సమన్వయం పెంచుకోవాలని, దేశంలో ఎక్కడైనా అక్రమ నిల్వలు ఉంటే వాటిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. స్మగ్లింగ్ ముఠాలకు నిధులు సమకూర్చే ఫైనాన్షియర్లపైనా దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడంలో సాధించిన ప్రగతిని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కాలంలో మొత్తం 506 కేసులు నమోదు చేసి 1,239 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. స్మగ్లింగ్‌కు వినియోగించిన 372 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కీలకమైన 12 మంది ప్రధాన స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో స్మగ్లర్లపై పీడీ చట్టం ప్రయోగించలేదని గుర్తుచేశారు.అంతేకాకుండా, గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి, అక్కడి అధికారుల సమన్వయంతో 35.6 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇటువంటి అంతర్రాష్ట్ర ఆపరేషన్లు జరగలేదని వారు పేర్కొన్నారు. ఈ చర్యల ఫలితంగా గతంలో 3 శాతం కంటే తక్కువగా ఉన్న శిక్షల రేటు (కన్విక్షన్ రేటు) ఇప్పుడు 95 శాతానికి పెరిగిందని, నిందితులకు కోర్టులు శిక్షలు విధించేలా పటిష్టమైన ఆధారాలు సమర్పిస్తున్నామని వివరించారు. అన్ని శాఖల సమష్టి కృషితో ఎర్రచందనం సంపదను కాపాడతామని అధికారులు ధీమా వ్యక్తం చేశారు.

## ఎల్‌నినోతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం

**మొదటిపేజీ తరువాయి**

సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్వేచ్ఛగా ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. భవిష్యత్తులో తాగునీటికి సంబంధించి ప్రధాన సమస్య వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే జూన్ వరకు వర్షాలు లేవని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. పశువులకు పశుగ్రాసం ఇబ్బందులు తలెత్తకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించి కరవు పరిస్థితిలో ఆరుతడి పంటలు వేయాలని అన్నదాతలకు సూచిస్తున్నామని అన్నారు. గ్రౌండ్ వాటర్ రోజురోజుకూ పడిపోతోందని.. దీనిని పెంచేందుకు ప్రత్యేక యాక్షన్ ఎ÷-లాన్ ద్వారా ముందుకెళ్లాలని దిశానిర్దేశర చేశారు. వీబీజీ రాంజీ ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలు తవ్వే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రతి వర్షం చుక్కను కాపాడుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈ సమావేశంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమవతి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తాగునీటి సరఫరా, సాగునీటి నిర్వహణ, పశుగ్రాసం, చెరువుల్లో నీటి నిల్వలు, ఇతర అత్యవసర చర్యలపై సమీక్ష నిర్వహించారు. తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రౌండ్ వాటర్ పెంపునకు ఇంకుడు గుంతల తవ్వకం, రైతులు ఆరుతడి పంటలు, ఆయిల్ ఫామ్ సాగు చేపట్లేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, అవసరమైన వనరులను సిద్ధంగా ఉంచాలని సమావేశంలో నిర్ణయించారు.

## విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్‌లు

**మొదటిపేజీ తరువాయి**

వ్యవహరించారు. పేద పిల్లల కోసం పనిచేస్తున్నామన్న దృష్టితో అధికారులు పనిచేయాలి. వచ్చే ఏడాది జూన్ 2 నాటికే విద్యార్థులకు యూనిఫామ్‌లు అందేలా కార్యాచరణ రూపొందించాలని రేవంత్ ఆదేశించారు. ఇదిలావుంటే క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో తాగునీటి సరఫరాకు సంబంధించి సమగ్ర తాగు నీటి సరఫరా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు విలీన మున్సిపాలిటీల్లోనూ తాగు నీటి సరఫరాలో ఏకరూపత ఉండాలని చెప్పారు. రానున్న 50 ఏళ్ల అవసరాలకు తగినట్లు మాస్టర్ ప్లాన్ ఉండాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. హైదరాబాద్ మహానగర తాగునీటి సరఫరా, సీవరేజీ బోర్డు పరిధిలోని పనులపై ముఖ్యమంత్రి ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం నెలకొనడంతో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న తాగునీటి వనరులను అనుసంధానించా లని చెప్పారు. ఏదైనా కారణాలతో ఒక సోర్స్ నుంచి నీరు సరఫరా కాకపోయినా మరో సోర్స్ నుంచి వచ్చే నీటిని ఆయా ప్రాంతాలకు సరఫరా చేసేందుకు అనుసంధానత ఉపయోగపడుతుందని అన్నారు.

జీహెచ్ఎంసీ పరిధిలో అనేక సంవత్సరాలుగా పలు ప్రాంతాల్లో మూడు నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారని, ఇక ముందు ఆ పరిస్థితి ఉండకూడదని ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఆయా ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తాగునీటి సరఫరా పనులను ఏడాదిన్నరలోపు కచ్చితంగా పూర్తి చేయాలని అధికారులకు తేల్చిచెప్పారు. ఎస్టీపీల నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి గారు ఆరా తీశారు. ఎస్టీపీల నిర్మాణాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే వాటిని వేగంగా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలని చెప్పారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులు, ఎస్టీపీల నిర్మాణ పనుల ప్రగతిపై ప్రతి నెల తనకు నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతి తెలుసుకునేందుకు వీలుగా డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో పరిశ్రమలు, వివిధ నిర్మాణ పనుల్లో గ్రే వాటర్ వాడేలా నిబంధనలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. సమీక్షలో మున్సిపల్ వ్యవహారాల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయష్ రంజన్ గారు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ , జల మండలి ఎండీ కె అశోక్ రెడ్డి , జేఎండీ మయాంక్ మిట్టల్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చేనేత కుటుంబాలకు ఏటా రూ.25వేలు

**మొదటిపేజీ తరువాయి**

ఏర్పాటు చేయనున్నారు. శ్రీకాకుళంలో బ్రహ్మకుమారీస్ సంస్థకు మున్సిపల్ స్థలం లీజు కొనసాగింపునకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. అగ్నిమాపక సేవల విస్తరణ పనులకు ఆమోదముద్ర వేసింది. ఏపీ మార్క్‌ఫెడ్‌కు సెంట్రల్ బ్యాంక్ నుంచి రూ.300 కోట్ల రుణానికి ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వివిధ సంస్థలకు భూ కేటాయింపులకు మంత్రివర్గం అంగీకారం తెలిపిందని పార్థసారథి తెలిపారు.గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సుమారు మూడు గంటలపాటు సమావేశం కొనసాగింది. భోగాపురం విమానాశ్రయం పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. అలాగే రెండో దశలో 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంశంపై మరింత అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ఈ అంశాన్ని మంత్రివర్గ ఉపసంఘం పరిశీలించి, తదుపరి కేబినెట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. చేనేత కార్మికులకు 'నేతన్న భరోసా' కింద రూ.25 వేలు చొప్పున ఆర్థికసాయం అందించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 50 ఏళ్లలోపు ఉన్న వారికి బీపీఎల్ నేతలకు సంవత్సరానికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. వెదుళ్లపల్లిలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడానికి ఏపీ కేబినెట్ నుంచి ఆమోదం లభించింది. ఏపీ మార్క్‌ఫెడ్‌కు సెంట్రల్ బ్యాంక్ నుంచి రూ.300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇవ్వడం వంటి అంశాలకు మంత్రివర్గం నుంచి ఆమోదం లభించింది. విష్ణు ఉమెన్స్ యూనివర్సిటీ, చలపతి యూనివర్సిటీలను ప్రైవేట్ యూనివర్సిటీల జాబితాలో చేర్చే ఆర్డినెన్స్‌పై కూడా మంత్రివర్గం చర్చించింది. అలాగే నేరడి బ్యారేజ్ నిర్మాణానికి రూ.641.10 కోట్ల పరిపాలనా అనుమతుల మంజూరుపై చర్చ జరిగింది. హెచ్ఎన్ఎస్-ఎస్ ఫేజ్-2 పనుల అంచనా వ్యయాన్ని రూ.241.20 కోట్ల నుంచి రూ.312 కోట్లకు పెంచేందుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. కేబినెట్ సమావేశంలో ఎల్‌నినోను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఎలినోవా పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని చెప్పారు. తాగునీటి సరఫరా, పశువులకు మేతపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులు, అధికారులకు సూచించారు. మెగా డీఎస్సీ అంశాన్ని ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలతో ముడిపెట్టి వైసీపీ రాజకీయ లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తోందని వ్యాఖ్యానించారు. లేని వివాదాలను సృష్టించే ప్రయత్నాలు జరుగుతాయని, అలాంటి చర్యలపై మంత్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పొగాకు ధరల అంశాన్ని సమావేశంలో మంత్రులు ప్రస్తావించారు. ఈ అంశాన్ని వివాదాస్పదం చేసేందుకు ప్రతిపక్షం ప్రయత్నిస్తోందని మంత్రులు చెప్పగా.. వాళ్లకు ఎందుకు అవకాశం ఇవ్వాలని సీఎం ప్రశ్నించారు. ప్రభుత్వం పొగాకు రైతుల కోసం తీసుకున్న చర్యలను ప్రజలకు ముందుగానే వివరించాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు ముందే తెలియజేస్తే ప్రతిపక్షానికి అవకాశం ఉండదని, ప్రో-యాక్టివ్‌గా మంత్రులు ముందుకెళ్లాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాలు, పోలవరం ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని ఒకే రోజు నిర్వహించే అంశంపై కేబినెట్‌లో చర్చ జరిగింది. పోలవరం ప్రాజెక్టు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని సీఎం పేర్కొన్నారు. పోలవరం ప్రారంభోత్సవం, గోదావరి పుష్కరాల ప్రారంభ కార్యక్రమాలను విడివిడిగా నిర్వహిస్తే బాగుంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశంలో చెప్పినట్లు సమాచారం.

## నేడు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

### యూనివర్సిటీ పరిధిలో పరీక్షలు వాయిదా




**హైదరాబాద్,జులై 23(జర్నలిస్ట్ వార్త)):** -తెలంగాణ వ్యాప్తంగా ఈ నెల 24న శుక్రవారం విద్యాసంస్థల బంద్‌కు పలు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ), జేఎన్‌టీయూ, తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ) పరిధిలో నిర్వహించే పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు ఆయా వర్సిటీలు ప్రకటించాయి. అనుబంధ కళాశాలల్లో జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నామని.. త్వరలో కొత్త తేదీని ప్రకటిస్తామని ఓయూ, జేఎన్‌టీయూ, టీయూ తెలిపాయి. ఈ మేరకు అనుబంధ కళాశాలలకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించాయి. నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాలు 24న బంద్‌కు పిలుపునిచ్చాయి.

## విద్యార్థులపక్షాన మేంఉన్నాం

### : గాంధీ స్మృతి వద్ద రాహుల్ గాంధీ నిరసన దీక్ష

**న్యూఢిలీజులై 23(జర్నలిస్ట్ వార్త)):**

నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ వివాదంతో నష్టపోయిన విద్యార్థులకు అండగా నిలుస్తూ ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు ఆందోళన చేపట్టారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో గురువారం సాయంత్రం ఢిల్లీలోని తీస్ జనవరి మార్గ్‌లో ఉన్న గాంధీ స్మృతి వద్ద వారు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ వివాదం కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు, నిరసనల్లో గాయపడిన వారికి సంఘీభావం ప్రకటించారు.అంతకుముందు, రాహుల్ గాంధీ నివాసంలో విపక్ష నేతలు సమావేశమయ్యారు. అనంతరం ప్రియాంక గాంధీ వాద్రాతో సహా పలువురు నేతలు బస్సుల్లో గాంధీ స్మృతికి చేరుకున్నారు. అక్కడ వారు తమ మొబైల్ ఫోన్ల ఫ్లాష్‌లైట్లను వెలిగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ఒక చేతిలో జాతీయ జెండాను, మరో చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని కనిపించారు.

ఈ నిరసనపై రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. న్యాయం, జవాబుదారీతనం కోరుతున్న విద్యార్థులతో ప్రతిపక్షాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. "భారతదేశ విద్యార్థులు ఒంటరి కాదు. విద్యార్థుల పక్షాన నిలబడకుండా మమ్మల్ని ఎవరూ ఆపలేరు" అని పేర్కొన్నారు. నీట్ అక్రమాల తర్వాత ప్రాణాలు తీసుకున్న విద్యార్థులను స్మరించుకుంటూ, ఆందోళనల్లో గాయపడిన వారికి మద్దతుగా ఈ పోరాటం చేస్తున్నామని తెలిపారు.

## ప్రభుత్వ బడి నుంచి లూనార్ మిషన్‌కు..

### ఏపీ విద్యార్థినిపై మంత్రి లోకేశ్ ప్రశంసలు



**అమరావతిజులై 23(జర్నలిస్ట్ వార్త)):**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అరుదైన అంతర్జాతీయ ఘనతను సొంతం చేసుకుంది. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కందుల జెస్సీ, ప్రపంచంలోనే మొట్టమొదటి గ్లోబల్ ఆల్-గర్ల్స్ లూనార్ క్యూబ్‌శాట్ మిషన్ అయిన 'మిషన్ శక్తిశాట్'కు ఎంపికయ్యారు.ఈ మిషన్‌లో భాగంగా జెస్సీ శాటిలైట్ రూపకల్పనలో అంతర్జాతీయ శాస్త్రవేత్తలతో కలిసి పనిచేయనున్నారు. ఈ శాటిలైట్‌ను అక్టోబర్ 11న శ్రీహరికోటలోని 'షార్' కేంద్రం నుంచి ప్రయోగించనున్నారు. ఒక ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అంతరిక్ష ప్రయోగంలో భాగస్వామి కావడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది.ఈ విజయంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. జెస్సీని అభినందిస్తూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రశంసలు కురిపించారు. "విద్యా రంగంపై మేం ఎందుకు ఇంతగా పెట్టుబడి పెడుతున్నామో అప్పుడప్పుడు ఇలాంటి కథలు గుర్తుచేస్తుంటాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ఒక ప్రభుత్వ పాఠశాల నుంచి అంతర్జాతీయ అంతరిక్ష మిషన్‌కు ఆమె ప్రయాణం, కలలు కనే ప్రతి యువతకు స్ఫూర్తిదాయకం" అని పేర్కొన్నారు."జెస్సీ, నువ్వు ఆంధ్రప్రదేశ్ గర్వపడేలా చేశావు. చంద్రుడిని, ఆపై శిఖరాలను అందుకోవాలని ఆశిస్తూ నీకు శుభాకాంక్షలు" అంటూ లోకేశ్ తన పోస్టులో అభినందనలు తెలిపారు.

RNI NO: TELTEL/2023/87607

## జూలై 26న జరిగే రిజర్వేషన్ డే సభను విజయవంతం చేయాలి: చెప్యాల ప్రకాష్



**భీమదేవరపల్లి/జూలై 23 (జర్నలిస్ట్ వార్త):** ఛత్రపతి సాహుజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఈ నెల 26న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సేన ఆధ్వర్యంలో నిర్వహించే రిజర్వేషన్ డే సభను విజయవంతం చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ పిలుపునిచ్చారు. ఈ సభకు గౌరవ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక ముఖ్య అతిథిగా, చెక్కుడు ప్రభాకర్, పెనుముల జగన్, డాక్టర్ కదిరి కృష్ణ, చలకాని వెంకట్ యాదవ్, డాక్టర్ బెల్లయ్య నాయక్ తదితరులు పాల్గొని రిజర్వేషన్లు, పూలే, సాహుజీ, అంబేద్కర్ ఆశయాలు, దళిత క్రైస్తవుల సమస్యలపై ప్రసంగించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, కవులు, కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని చెప్యాల ప్రకాష్ కోరారు. ఈ కార్యక్రమంలో గుగులోతు లక్ష్మణ్ నాయక్, తుపాకుల రవి, కాదాసు రాజేష్, కొత్తపల్లి వంశీ, జోడుముంతల రమేష్, చల్ల కిరణ్, గాడిపెల్లి హరీష్, అల్లి వెంకటేష్, గుజ్జేటి శ్రీనివాస్, తాళ్లపల్లి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## నీట్ లీక్‌పై కాంగ్రెస్ ఫైర్

### విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్.. ధర్మసాగర్‌లో నిరసన




**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూలై 23 (జర్నలిస్ట్ వార్త):** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ ధర్మసాగర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. సర్కిల్ కేంద్రంలో నిర్వహించిన నిరసనలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెసరు రమేష్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ దేశ విద్యా వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసిన అత్యంత దురదృష్టకర ఘటనగా అభివర్ణించారు. లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని, వారి ఆశయాలను ఒక్కసారిగా ప్రశ్నార్థకం చేసిన ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపి లీకేజీ వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. శాంతియుతంగా తమ హక్కుల కోసం నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులను ప్రయోగించడం ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్య అని మండిపడ్డారు. విద్యార్థులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం వారిపైనే బలప్రయోగానికి దిగడం దుర్మార్గమని విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ నాయకులు, విద్యార్థుల భవిష్యత్తు కోసం తమ పోరాటం గ్రామగ్రామాన కొనసాగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగడతామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## రైతు నమోదు 86% పూర్తి

### వెనుకబడిన రైతులు వెంటనే నమోదు చేసుకోవాలి

### ముప్పారంలో ప్రక్రియను పరిశీలించిన వ్యవసాయ అధికారి



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 23 (జర్నలిస్ట్ వార్త):** రైతు సంక్షేమ పథకాల అమలులో కీలకమైన రైతు నమోదు ప్రక్రియను ధర్మసాగర్ మండలంలో వేగవంతం చేసిన వ్యవసాయ శాఖ ఇప్పటి వరకు 86 శాతం నమోదు పూర్తి చేసినట్లు వెల్లడించింది. ముప్పారం గ్రామంలో బుధవారం రైతు నమోదు ప్రక్రియను వ్యవసాయ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇంకా నమోదు చేయించుకోని రైతులు ఆలస్యం చేయకుండా తమ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)ని సంప్రదించాలని సూచించారు. గ్రామానికి దూరంగా నివసిస్తున్న రైతులు సమీపంలోని మీ సేవ కేంద్రాల్లో కూడా రైతు నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. రైతు నమోదు లేకపోతే ప్రభుత్వ పథకాల లబ్ధి దూరమేనని స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీ, సీఎం కిసాన్, సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల పంపిణీతో పాటు భవిష్యత్తులో ప్రభుత్వం అమలు చేసే అన్ని వ్యవసాయ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలంటే రైతు నమోదు తప్పనిసరిగా ఉండాలని వివరించారు. మిగిలిన రైతులందరూ గడువులోగా నమోదు పూర్తి చేసుకుని ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ పరిశీలనలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజేందర్, గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

**వర్ధన్నపేట/ జులై 23(జర్నలిస్ట్ వార్త)):** భర్త, అత్తమామల వేధింపులు తాళలేక గడ్డిమందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన చంద్రు తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. చంద్రు తండాకు చెందిన భూక్య ప్రియాంక (33)కు, అదే గ్రామానికి చెందిన భూక్యా రవితో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎనిమిదేళ్ల పాటు కాపురం సజావుగా సాగినప్పటికీ, ఆ తర్వాత రవి వేరొక మహిళను వివాహం చేసుకుని ప్రియాంకతో గొడవలకు దిగడం ప్రారంభించాడు. గత కొంతకాలంగా భర్త రవితో పాటు ఆయన బంధువులు శారీరకంగా, మానసికంగా తీవ్రంగా వేధిస్తుండటంతో ప్రియాంక మనస్తాపానికి గురైంది. పలుమార్లు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. భర్త, అత్తమామల వేధింపులు భరించలేక ప్రియాంక ఇటీవల గడ్డిమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఈ నెల 21న ఉదయం 11:00 గంటలకు మృతి చెందింది. తన కుమార్తె మృతిపై భర్త రవి, ఆయన కుటుంబ సభ్యులపై అనుమానాలు ఉన్నాయని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## పీవీ ఆశయాలకు ప్రతీకగా వంగరలో పీవీ విజ్ఞాన కేంద్రం

### మంత్రి పొన్నం ప్రభాకర్

### త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం





**భీమదేవరపల్లి/జూలై 23 (జర్నలిస్ట్ వార్త):** మాజీ ప్రధాని, భారతరత్న పాములపర్తి వెంకట నరసింహారావు ఆశయాలకు ప్రతీకగా ఆయన స్వగ్రామమైన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం పనులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రంలో తుది దశలో కొనసాగుతున్న నిర్మాణ పనులను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యతకు ఎలాంటి రాజీ పడకుండా పనులను వేగంగా పూర్తి చేసి త్వరలోనే ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విజ్ఞాన కేంద్రంలోని ఫోటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం, అంఫీథియేటర్, ఆడిటోరియం, ధ్యాన మందిరం తదితర విభాగాలను సందర్శించారు. ఫోటో గ్యాలరీలో పీవీ నరసింహారావు జీవిత విశేషాలు, రాజకీయ ప్రస్థానం, దేశానికి చేసిన సేవలు, ఆర్థిక సంస్కరణలు, చారిత్రక ఘట్టాలను ప్రతిబింబించే చిత్రాలు, అరుదైన జ్ఞాపకాలను పరిశీలించి పీవీ కుటుంబ సభ్యులతో చర్చించారు. ప్రదర్శనను మరింత ఆకర్షణీయంగా, భావితరాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దేందుకు పలు సూచనలు చేశారు. దేశ రాజకీయ, ఆర్థిక సంస్కరణలకు మార్గదర్శకుడైన పీవీ నరసింహారావు గొప్ప వారసత్వాన్ని యువతకు చేరవేసే విధంగా ఈ విజ్ఞాన కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. కేంద్రం పరిసరాల్లో గార్డెన్ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, విస్తృతంగా మొక్కలు నాటడంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో పీవీ నరసింహారావు కుమారులు ప్రభాకర్ రావు, రాజేశ్వర్ రావు, భీమదేవరపల్లి మండల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పీవీ విజ్ఞాన కేంద్రం పనులు వేగవంతం చేయాలి

### : కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

### కేజీబీవీ పాఠశాల తనిఖీ..

### విద్యార్థినుల సౌకర్యాలపై కలెక్టర్ ఆరా









**భీమదేవరపల్లి/జూలై 23(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం భీమదేవరపల్లి మండలంలో పర్యటించి వంగర గ్రామంలో నిర్మాణంలో ఉన్న పీవీ విజ్ఞాన కేంద్రం పనులను పరిశీలించడంతో పాటు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి. నరసింహారావు స్వగ్రామం వంగరలో తుది దశకు చేరుకున్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్రంలోని ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియం, ప్రాంగణంలో నాటిన మొక్కలు, విద్యుత్ లైటింగ్, తాగునీటి సౌకర్యాలు, నిర్వహణ ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేసి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను మరింత వేగవంతంగా పూర్తి చేసి కేంద్ర నిర్వహణను మెరుగ్గా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సృజన, కుడా సీపీవో అజిత్ రెడ్డి, డీఈ రఘు, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం తదితర అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

అనంతరం భీమదేవరపల్లి మండలంలోని వంగర రోడ్డులో ఉన్న కేజీబీవీ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటశాల, తరగతి గదులు, తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్లు, పరిశుభ్రతను పరిశీలించి విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థినులతో ఆత్మీయంగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న విద్య, వసతి, ఆహారం, తాగునీరు తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రత, ఆహార నాణ్యత, విద్యార్థినుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీలో తహసీల్దార్ రాజేష్, ఎంఈవో సునీతారాణి, ఎంపీడీవో వీరేశం, కేజీబీవీ ప్రత్యేకాధికారి జ్యోతి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఉనికిచెర్లకు రూ.5 కోట్ల వరం

### ఫోర్‌లేన్ రోడ్డు.. సీసీ రోడ్లు.. శ్మశానవాటిక అభివృద్ధికి శ్రీకారం

### ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు.. 700 మందికి చీరల పంపిణీ -ఉనికిచెర్లను పట్టణానికి దీటుగా తీర్చిదిద్దుతా ఎమ్మెల్యే కడియం శ్రీహరి







**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూలై 23 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ఉనికిచెర్ల గ్రామానికి మరోసారి భారీ అభివృద్ధి వరించింది. సుమారు రూ.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి గురువారం శంకుస్థాపన చేశారు. ఫోర్‌లేన్ రహదారి, అంతర్గత సీసీ రోడ్లు, ఆధునిక శ్మశానవాటిక నిర్మాణ పనులను ప్రారంభించడంతో పాటు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాల్లో పాల్గొన్నారు. అనంతరం 700 మంది మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.

సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండేళ్లలో రూ.35 వేల కోట్లతో ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రచారం చేసిన గత ప్రభుత్వం ఉనికిచెర్లకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు.

1994లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే గ్రామంలో ఎస్సీ కుటుంబాలకు పక్కా ఇళ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు కల్పించామని గుర్తు చేశారు. అనంతరం రెండు దశాబ్దాల పాటు గ్రామాభివృద్ధి నిలిచిపోయిందని, తిరిగి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇప్పటికే రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, తాజాగా మరో రూ.5 కోట్ల పనులకు శ్రీకారం చుట్టామని వెల్లడించారు.

**నాలుగు లైన్ల రహదారి**

ఓఆర్ఆర్ నుంచి ఉనికిచెర్ల వరకు నాలుగు లైన్ల రహదారితో పాటు సెంట్రల్ లైటింగ్, సైడ్ డ్రైనేజీలను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. అవసరమైన అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

**ఆధునిక శ్మశానవాటిక**

రూ.50 లక్షలతో ప్రహరీ గోడ, బర్నింగ్ ప్లాట్‌ఫాం, బోర్‌వెల్, ఓవర్‌హెడ్ ట్యాంక్, స్నాన సదుపాయాలు, సీసీ రోడ్డు నిర్మించి ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**సీసీ రోడ్లు.కమ్యూనిటీ హాల్**

గ్రామంలోని మిగిలిన వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించడంతో పాటు ఎంపీ నిధులతో మహిళా సంఘాల కోసం కమ్యూనిటీ హాల్ మంజూరు చేస్తామని తెలిపారు. కడియం శ్రీహరి ఉన్నప్పుడే అభివృద్ధి జరిగింది. మళ్లీ ఇప్పుడు కూడా అదే వేగంతో జరుగుతోంది. ప్రజలు పని చేసే నాయకులను, మాటలకే పరిమితమైన నాయకులను గుర్తించాలి అని వ్యాఖ్యానించారు.

కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ అధికారులు, హౌసింగ్ అధికారులు, తహసీల్దార్, బావ్ సింగ్.ఎంపీడీవో, అనిల్ కుమార్ కార్పొరేటర్ ఆవాల రాధికా రెడ్డి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక


# కాంగ్రెస్‌కు తీరని లోటు.. అట్ల మట్టయ్య మృతి

## కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్



**దామరచర్ల/, జూలై 23 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీకి నిబద్ధతతో సేవలందించిన సీనియర్ నాయకుడు అట్ల మట్టయ్య మృతి పార్టీకి తీరని లోటని వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. గురువారం మట్టయ్య మృతి విషయం తెలుసుకున్న ఆయన దామరచర్లలోని మట్టయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.మట్టయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. పార్టీ సిద్ధాంతాల పట్ల అచంచల నిబద్ధతతో, కార్యకర్తగా, నాయకుడిగా మట్టయ్య చూపిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు.మట్టయ్య మరణం దామరచర్ల ప్రాంత కాంగ్రెస్‌కు తీవ్ర లోటని పేర్కొన్న ఎమ్మెల్సీ, ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. భగవంతుడు మృతుని ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

# ప్రశ్నించే గొంతులను అణచలేరు

## నీట్ లీకేజీపై ఎల్కతుర్తిలో కాంగ్రెస్ ధర్నా.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు




**ఎల్కతుర్తి/, జూలై 23 (జర్నలిస్ట్ వార్త):** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై న్యాయం కోరుతూ ఢిల్లీలో జరిగిన నిరసనల్లో ప్రతిపక్ష నేతలు, విద్యార్థులపై తీసుకున్న చర్యలను నిరసిస్తూ ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ, జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడం, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ తదితరులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.నీట్ పేపర్ లీకేజీతో దేశ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ప్రశ్నించే విద్యార్థుల గొంతును అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం పోలీసు బలగాలను ఉపయోగిస్తోందని ఆరోపించారు. నీట్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిపై నిష్పక్షిక దర్యాప్తు చేపట్టాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, దండేపల్లి సర్పంచ్ సంపత్, జిల్గుల సర్పంచ్ రాజు, గోలి రాజేశ్వరరావు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజయ్య గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ ముప్పు మహేందర్, అంబాల స్వామి, వెంకటేష్, డాక్టర్ రమేష్, యువరాజ్, ప్రదీప్, మణికిరణ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భీమారంలో మోదీ దిష్టిబొమ్మ దహనం

## రాహుల్ గాంధీ అరెస్టుపై కాంగ్రెస్ నిరసన..

## విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్



**హసన్‌పర్తి,/ జూలై 23 (జర్నలిస్ట్ వార్త):** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ హనుమకొండ జిల్లా భీమారం 55వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి పిలుపు మేరకు 55వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం అరుణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా గడ్డం అరుణ్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీసిందన్నారు. విద్యార్థులకు అండగా నిలుస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని విమర్శించారు.నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణ వ్యవస్థను పటిష్ఠం చేయాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాం ప్రసాద్, మార్క రాజు, ఆకుల కుమార్, గడ్డం వరుణ్, వీర సుధాకర్, తాళ్ల రమేష్, చిట్టిబాబు, అటికం భిక్షపతి, ప్రదీప్, రవి, శ్రీనాథ్, గజాల గోవర్ధన్, నాతి భాస్కర్, గడ్డం గోపీనాథ్‌తో పాటు డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# 25న కిట్స్ వరంగల్‌లో అలమ్నై మీట్

## సిల్వర్ జూబ్లీ బ్యాచ్2001 రీయూనియన్‌కు ఏర్పాట్లు పూర్తి



**హసన్‌పర్తి/జూలై 23 (జర్నలిస్ట్ వార్త):** కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్), వరంగల్‌లో ఈ నెల 25న అలమ్నై మీట్ అండ్ సిల్వర్ జూబ్లీ బ్యాచ్ రీయూనియన్‌క్లాస్ ఆఫ్ 2001 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి తెలిపారు.కిట్స్ వరంగల్ పూర్వ విద్యార్థుల సంఘం (కిట్స్‌వా) ఆధ్వర్యంలో కళాశాల ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి దేశ, విదేశాల్లో ప్రముఖ పారిశ్రామికవేత్తలు, నిపుణులైన ఇంజినీర్లుగా రాణిస్తున్న కిట్స్ పూర్వ విద్యార్థులు, కిట్స్‌వా నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారని వెల్లడించారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి కిట్స్‌వా నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ అధ్యక్షుడు సి. శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారు. కిట్స్ వరంగల్ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు అధ్యక్షత వహించనుండగా, కోశాధికారి పి. నారాయణరెడ్డి, కిట్స్ అడిషనల్ సెక్రటరీ, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వి. సతీశ్ కుమార్తో పాటు యాజమాన్య సభ్యులు పాల్గొంటారు.
అలమ్నై అఫైర్స్ అండ్ ఎక్స్‌టర్నల్ రిలేషన్స్ ప్రొఫెసర్ ఇన్‌చార్జి డా. ఎం. శ్రీకాంత్, ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డా. ఓ. ఆంజనేయులు, వివిధ విభాగాల డీన్లు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, సిబ్బంది, పీఆర్‌వో డా. డి. ప్రభాకరాచారి కూడా కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

# సర్ ప్రక్రియ వేగంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు చొరవ తీసుకోవాలి.

## -తహసీల్దార్ నాగరాజు.



**బయ్యారం/,జులై 23.(జర్నలిస్ట్ వార్త)** సర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల (బీఎల్ఏలు)బిఎల్ఓల సమన్వయంతో పని చేసేలా చొరవ తీసుకోవాలని తహసీల్దార్ నాగరాజు సూచించారు.గురువారం సర్ పురోగతిపై తహసీల్దార్ నాగరాజు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు సర్ ప్రక్రియ డిజిటైజేషన్ 85.45 శాతం పూర్తయిందని తెలిపారు.మండల వ్యాప్తంగా ఆయా రాజకీయ పార్టీల బీఎల్ఏలు స్థానికంగా పని చేస్తున్న బూత్ లెవల్ అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని తెలిపారు.బిఎల్ ఓలతో సహకరిస్తూ ఓటర్లందరూ తమ ఎన్యుమరేషన్ ఫారంలను సమర్పించే విధంగా బిఎల్ఏలు చొరవ తీసుకోవాలని సూచించారు.ఈ సమయంలో రాజకీయ పార్టీల బూత్ లెవెల్ అధికారులకు పూర్తి సహకారం అందించి,ఇంకా ఎవరైనా ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారంలు తిరిగి ఇవ్వకపోతే,వారు పూరించి ఇచ్చేలా చొరవ తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు,ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గిరిజన చట్టాలపై అనుచిత వ్యాఖ్యలు చేయలేదు.

## -సర్పంచుల ఫోరం జిల్లా నాయకులు భూక్యా ప్రవీణ్ నాయక్.



**బయ్యారం/,జులై 23.(జర్నలిస్ట్ వార్త)** గిరిజన చట్టాలపై తక్కువ చేసి ఇల్లెందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య ఎక్కడా మాట్లాడలేదని ముగ్గురు వ్యక్తులు గిరిజన చట్టాల పేరుతో గిరిజనేతలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని వారి దృష్టికి రావడంతో మీడియా సమావేశం నిర్వహించినట్లు సర్పంచుల ఫోరం జిల్లా నాయకులు ప్రవీణ్ నాయక్ అన్నారు.గురువారం మండల కేంద్రంలోని కోదండ రామాలయ ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ సర్పంచులు ఫోరం మండల అధ్యక్షుడు చింత ప్రసాద్ ఆధ్వర్యంలో ఉపసర్పంచులు మీడియా సమావేశమును నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కొత్తపేట సర్పంచ్ ప్రవీణ్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ మండలంలో గిరిజన,ఆదివాసి ప్రజాప్రతినిధులపై ఆర్టిఏ లతో బెదిరింపులు చేయడం మానుకోవాలని, ఇదేమిటని ప్రశ్నిస్తే ఎమ్మెల్యేపై సర్పంచ్ లపై ,ప్రజాప్రతినిధుల పైన సోషల్ మీడియాలో ఇష్టాన్ని రీతిలో పోస్టులు పెడుతూ కులాల మధ్య వైరుధ్యాలు సృష్టించడం మంచిది కాదని తెలిపారు. ఇప్పటికైనా వారి పద్ధతి మార్చుకోవాలని లేనిపోని ఆరోపణలు ఎమ్మెల్యేకు అంటగట్ట వద్దని,గిరిజన చట్టాలపై తక్కువ చేసి,గిరిజనేతరులకు వంత పాడుతున్నారని చెప్పడం హేయమైన చర్య అని హితవుపలికారు.నియోజకవర్గంలో అందరి ప్రజల హక్కులను, కాపాడటం,వారి అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే పనిచేస్తున్నారని అన్నారు. మండలంలో ముగ్గురు వ్యక్తుల బిజెపి పార్టీల ముసుగులో గిరిజనేతరులను బ్లాక్ మెయిల్ చేయడం పైనే ఎమ్మెల్యే స్పందించడం జరిగిందని అన్నారు.పద్ధతి మార్చుకోవాలని లేని యెడల చట్ట పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు పానుగోతు వెంకన్న,చింత ప్రసాద్,రవి నాయక్,బానోత్ బాలకృష్ణ,లింగ నాయక్,ఎట్టి సరోజన,మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు భూక్యా రవి నాయక్,నాగేశ్వరావు,మండల కాంగ్రెస్ పార్టీ ఉపసర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రశేఖర్ ఆజాద్ అడుగుజాడల్లో నడుద్దాం.

## -సూరం సుధాకర్ రెడ్డి



**బయ్యారం/,జులై 23.(జర్నలిస్ట్ వార్త)** స్వాతంత్ర పోరాట యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ అడుగుజాడల్లో నడుద్దామని కాంగ్రెస్ నాయకులు సూరం సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.గురువారం చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.స్వాతంత్ర్య సాధనకు భారత్ చేసిన పోరాటంలో ఆయన పోషించిన పాత్ర చాలా విలువైందని,న్యాయం పక్షాన ధైర్య సాహసాలతో,దృఢ విశ్వాసంతో నిలిచేలా మన దేశ యువతకు ఆయన ప్రేరణను కూడా అందించారని సుధాకర్ రెడ్డి అన్నారు.

# ప్రధాని నివాసం వద్ద నిరసన తెలపడం సిగ్గుచేటు.

## -తుమ్మల శ్రీనివాస్ రావు.



**బయ్యారం/,జులై 23.(జర్నలిస్ట్ వార్త)** నీట్ పేపర్ లీకేజీ అంశంపై నిరసన తెలుపుతూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడి చేసి నిరసనను తెలపడంపై బీజేపీ పార్టీ మండల కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ రావు తీవ్రంగా ఖండించారు.ఈ చర్య రాజ్యాంగ హోదా దుర్వినియోగమని, బాధ్యతారహితమైన పిల్లచేష్టల రాజకీయాలంటూ తుమ్మల శ్రీనివాస్ రావు విమర్శించారు.రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత హోదాలోని నిబంధనలను,భద్రతా ప్రోటోకాల్స్‌ను విస్మరించి ప్రధాని నివాసం వద్ద నిరసన తెలపడం సిగ్గుచేటని అన్నారు.ఈ నిరసన భారతీయ ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక చీకటి రోజని,దేశంలో అశాంతిని సృష్టించేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని తుమ్మల ఆరోపించారు.దేశ ప్రధాని భద్రత అత్యంత కీలకమైనదని,విదేశీ శక్తులతో చేతులు కలిపి రాహుల్ గాంధీ దేశాన్ని విడగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని తుమ్మల శ్రీనివాస్ రావు మండిపడ్డారు.

# నీట్ లీక్‌పై దామరచర్లలో కాంగ్రెస్ ఆందోళన

## మోదీ దిష్టిబొమ్మ దహనం.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్






**దామరచర్ల,/ జూలై 23 (జర్నలిస్ట్ వార్త):** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ దామరచర్ల మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
పీసీసీ పిలుపు మేరకు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమేనని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజాస్వామ్య పరిరక్షణ, విద్యార్థుల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రఘుపతి రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన భట్టి విక్రమార్క

## కాంగ్రెస్‌కు మంచి నాయకుడిని కోల్పోయాం.. కుటుంబానికి అండగా ఉంటామని హామీ

**తల్లాడ,/ జూలై 23 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తల్లాడ మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతి రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.రఘుపతి రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఉప ముఖ్యమంత్రి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రఘుపతి రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ తరఫున అన్నివేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తల్లాడ మండలంలో కాంగ్రెస్ పార్టీ ఓ సమర్థ నాయకుడిని కోల్పోయిందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి రఘుపతి రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ



గౌడ్, సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయ నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు, జిల్లా నాయకుడు జక్కంపూడి కిషోర్, సీనియర్ నాయకుడు



దుండేటి వీరారెడ్డి, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాప సుధాకర్, మాజీ జెడ్పీటీసీ మూకర ప్రసాద్, దీవెల బాబు, మల్లవరం సర్పంచ్ కటిక కిరణ్‌కుమార్, ఎస్టీ సెల్ నాయకుడు అంజయ్య, కోసూర్ వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాసేవకు అంకితమైన నేత...

## రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం


మాజీ విజిలెన్స్ కమిటీ మెంబర్ కొట్టే ప్రవీణ్

నాయకత్వం అంటే పదవి కాదు... ప్రజలతో నిరంతర అనుబంధం అనే భావనతో రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నాయకుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్). ఆధునిక ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, ప్రజలతో ప్రత్యక్ష సంభాషణ, రాజకీయ దూకుడుఇవి ఆయన నాయకత్వ శైలిలో కనిపించే ముఖ్య లక్షణాలు. నేడు ఆయన జన్మదినం సందర్భంగా రాజకీయ ప్రయాణాన్ని ఒకసారి పరిశీలిస్తే అనేక కోణాలు కనిపిస్తాయి.

తెలంగాణ ఉద్యమం చివరి దశలో పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించిన కేటీఆర్, రాష్ట్ర ఏర్పాటు అనంతరం మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఐటీ, పరిశ్రమలు, పురపాలక రంగాల్లో పనిచేశారు. హైదరాబాద్‌ను పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన చర్యలు, అంతర్జాతీయ సంస్థలతో చర్చలు, పరిశ్రమల పెట్టుబడుల కోసం చేసిన ప్రయత్నాలు ఆయన అనుచరులు ప్రస్తావించే అంశాలు. అదే



సమయంలో ఆయన విధానాలపై విమర్శలు చేసిన రాజకీయ ప్రత్యర్థులు కూడా ఉన్నారు.

ప్రజలతో నేరుగా మమేకమవడం కేటీఆర్ రాజకీయ శైలిలో మరో ప్రత్యేకత. గ్రామం నుంచి మహానగరం వరకు వివిధ వర్గాల ప్రజలతో సమావేశాలు, యువతతో సంభాషణలు, సామాజిక మాధ్యమాల ద్వారా స్పందనలుఇవి ఆయన ప్రజల్లో చర్చనీయాంశంగా నిలవడానికి కారణమయ్యాయి.

రాజకీయంగా సవాళ్లు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడం, ప్రత్యర్థుల విమర్శలకు సభల్లోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ సమాధానం ఇవ్వడం ఆయన రాజకీయ ధోరణిగా కనిపిస్తుంది. అధికారంలో ఉన్నప్పుడైనా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడైనా ప్రజా సమస్యలపై స్పందిస్తూ రాజకీయ చర్చల్లో చురుకుగా పాల్గొంటున్నారు.

ప్రస్తుతం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీని బలోపేతం చేసే బాధ్యతలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు, కార్యకర్తల సమావేశాలు, ప్రజా సమస్యలపై ఆందోళనలు, ప్రభుత్వ విధానాలపై విమర్శలుఇవన్నీ ఆయన రాజకీయ కార్యాచరణలో భాగమయ్యాయి.

జన్మదినాన్ని వ్యక్తిగత వేడుకగా కాకుండా సేవా కార్యక్రమాల దినంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, మొక్కల నాటడం, వైద్య శిబిరాలు, విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. తెలంగాణ రాజకీయాల్లో కేటీఆర్‌పై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, రాష్ట్ర రాజకీయాల్లో ప్రభావం చూపుతున్న నాయకుల్లో ఆయన ఒకరనే విషయంపై విస్తృత చర్చ ఉంది. ఒకవైపు అనుచరులు ఆయనను అభివృద్ధి, సాంకేతికత, యువ నాయకత్వానికి ప్రతీకగా అభివర్ణిస్తే, మరోవైపు విమర్శకులు ఆయన విధానాలను ప్రశ్నిస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటారు.

అధికారంలోనూ, ప్రతిపక్షంలోనూ ప్రజా చర్చల్లో కేంద్రబిందువుగా నిలుస్తూ, తనదైన రాజకీయ శైలితో ముందుకు సాగుతున్న కేటీఆర్ రాజకీయ ప్రయాణం తెలంగాణ రాజకీయ పరిణామాల్లో ముఖ్యమైన అధ్యాయంగా కొనసాగుతోంది. జన్మదినం సందర్భంగా ఆయనకు వివిధ వర్గాల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతుండగా, సేవా కార్యక్రమాలతో పార్టీ శ్రేణులు వేడుకలను నిర్వహిస్తున్నాయి.






## డ్రైనేజీ పనులు వేగవంతం చేయండి

### జాప్యంపై కఠిన చర్యలు తప్పవు - కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి





**ఎల్కతుర్తి/ జూలై 24 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి జంక్షన్ వద్ద జాతీయ రహదారి ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను వేగవంతం చేసియుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం లేదా జాప్యం ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం ఆకస్మిక తనిఖీలో భాగంగా సిద్ధిపేటకరీంనగర్ ప్రధాన రహదారిపై ఎల్కతుర్తి జంక్షన్ వద్ద కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీసిన ఆయన, ఇంకా మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు ఫోన్ ద్వారా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రహదారిపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు. అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి జాప్యానికి తావు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ప్రాజెక్టు అధికారి అజిత్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టుపై కాంగ్రెస్ నిరసన

### మోడీ దిష్టిబొమ్మ దహనం.. నీట్ లీకేజీపై కేంద్రాన్ని నిలదీత

**హసన్‌పర్తి, /జూలై 23 (జర్నలిస్ట్ వార్త):**

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ హసన్‌పర్తిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామ్‌రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ అధ్యక్షుడు చిర్ర రాముగౌడ్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ దేశ విద్యా వ్యవస్థపై చెరగని మచ్చగా నిలిచిందన్నారు.



లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, ప్రతిపక్ష నాయకులపై పోలీసు బలాన్ని ప్రయోగించడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. లాఠీచార్జీలు, అరెస్టులతో విద్యార్థుల ఉద్యమాలను అణచివేయలేరని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, దేవరకొండ అనిల్, సంపత్ యాదవ్, డబ్బా శ్రీను, చిట్టి నర్సయ్య, చార్లెస్, ఉపేంద్రం, రమేష్ యాదవ్, కోర్నెల్, నందకిషోర్, ప్రణీత్, కిషోర్, రవి యాదవ్, కత్తుల మొగిలి, రాజన్న గౌడ్, మట్టెడ భరత్, సంద్ర కార్తీక్, చిర్ర సంపత్, శ్రీరామ్, సుధాకర్, తిరుపతి రెడ్డి, నరోత్తం రెడ్డి, సారంగపాణి, కిరణ్, శ్రీనివాస్, రాజు, రాజేర్, ప్రభాకర్ రెడ్డి, జయరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ లీకేజీపై కాంగ్రెస్ రాస్తారోకో

### రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ నిరసన

**హసన్‌పర్తి, /జూలై 23 (జర్నలిస్ట్ వార్త):**

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారాన్ని నిరసిస్తూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ హసన్‌పర్తి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరాంరెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేణుకుంట్ల అశోక్, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ తంగేళ్లపల్లి తిరుపతి, 65వ డివిజన్ అధ్యక్షుడు నేదునూరి సునీల్, 66వ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ దేశ విద్యా వ్యవస్థపై చెరగని మచ్చగా నిలిచిందన్నారు. లక్షలాది



మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశ విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని కోరారు. విద్యార్థులపై జరిగిన దాడులకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల తరఫున ప్రశ్నించిన రాహుల్ గాంధీని అరెస్టు చేయడం, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీతో అనుచితంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. ప్రశ్నించే గొంతులను అణచివేసినా ప్రజల ఆగ్రహాన్ని అణచలేరని, విద్యార్థుల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నిరసనలో మాజీ మండల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్, సర్పంచుల ఫోరం కన్వీనర్, గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఎస్సీ, బీసీ, మైనారిటీ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ధర్నా.. ప్రభుత్వంపై స్టాలిన్ విమర్శలు

**వరంగల్ /బ్యూరో జూలై 23 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ. స్టాలిన్ డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదల కోరుతూ గురువారం ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏకశిలా పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తవుతున్నా విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించకపోవడం విచారకరమన్నారు. ముఖ్యమంత్రి వద్దే విద్యాశాఖ ఉన్నప్పటికీ విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావడం లేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా



విద్యార్థులకు రావాల్సిన రూ. 10,500 కోట్లకుపైగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ఉన్నత విద్య కొనసాగించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఫీజుల పేరుతో ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేయడం వల్ల ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను క్లస్టర్లుగా మార్చే ప్రతిపాదనను విరమించుకోవాలని, పాఠశాలల సంఖ్య తగ్గించడం కాకుండా మౌలిక



సదుపాయాలు మెరుగుపరచాలని సూచించారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి, జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్, నాయకులు మేకల అభిరామ్, జిలకర కార్తీక్, జి. సురేష్, ప్రశాంత్, రెండావుల రాజేష్, పెనుకుల మధు, వేముల శ్రీకాంత్, పెండ్యాల రాజ్‌కుమార్, మహమ్మద్ యాసిన్, ముత్యాల కౌశిక్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యువత ఆక్రోశానికి..సమాధానమేదీ?


**జులై 23(జర్నలిస్ట్ వార్త)):**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. వరుసగా నాలుగోరోజు కూడా ఉభయ సభల్లో గందరగోళం నెలకొంది. సమావేశాలు సజావుగా సాగడం లేదు. నీట్ లీకేజీపై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు దిగింది. నీట్ లీకేజీకి బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సంసద్ చలో ఆందోళనకు పిలుపునిచ్చింది. వారి ఆందోళనలో వందశాతం న్యాయం ఉంది. ఎందుకంటే పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థులు...పాలకులు అయినప్పుడు ప్రజలు స్పందిస్తారు. నిలదీస్తారు. నీట్ పరీక్ష వల్ల జరిగిన గందరోగళం ఎందరినో బలితీసుకుంది. ఎందరో తల్లిదండ్రులు క్షోభకు గురయ్యారు. దీనిని ఓ చిన్న సమస్యగా ప్రభుత్వం భావించి ఉండవచ్చు. కానీ విద్యార్థులకు మాత్రం ఇది జీవన్మరణ సమస్య. ఇకపోతే నాలుగు రోజులుగా గందరగోళం జరుగుతున్నా ప్రధాని మోడీ మౌనం వీడడం లేదు. కేవలం ఎక్స్ వేదికగా కఠినంగా వ్యవహరిస్తామని, నీట్ దోషుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. దేశంలో ఓ పెద్ద ఆందోళన జరుగుతంటే ఇదేనా ప్రధానిగా ఉన్న వ్యక్తి చేయాల్సిన పని. మణిపూర్ అల్లర్లు, ఢిల్లీలో రైతుల ఆందోళన, నీట్ పరీక్షా పేపర్ లీకేజీ, అయోధ్య విరాళాల చోరీ..ఇటీవల వరుసగా జరిగిన సంఘటనలు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటిపై పార్లమెంటులో చర్చించడం జరగాలి. ప్రధాని మోడీ మౌనం వీడి పార్లమెంట్‌కు వచ్చి, నేరుగా సమాధానం చెప్పాల్సిన ముఖ్యమైన అంశాలు. దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్‌ను మౌనమునిగా విమర్శించిన మోడీ ఇప్పుడు అంతకు మించి మౌనంగా మారారు. పార్లమెంట్ జరుగుతన్నా రాకుండా చోద్యం చూస్తూ ఎక్స్‌లో పోస్టులు పెట్టడం సరికాదు. ఇక్కడ సమాధానం చెప్పడం అంటే దేశప్రజలకు సమాధానం చేరవేయడంగా గుర్తించాలి. బాధ్యతగల ప్రధానిగా మోడీ పార్లమెంట్‌కు వచ్చి సమాధానం ఇవ్వాలి. కానీ అలా జరగడం లేదు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదు. ఆయన వందిమాగధులు ఇదంతా విపక్షాలతో తమకున్న పంచాయితీలాగా సవాళ్లు విసరుతున్నారు. దేశం తీవ్ర ఆందోళనలో ఉంటే ఇదేనా పాలక పార్టీ వ్యవహరించే తీరు. ఇకపోతే దేశంలోని వ్యవస్థల్లో అవినీతి పాతుకుపోయిందనడానికి నీట్ పేపర్ లీకేజీ వంటివి పరాకాష్టగా చూడాలి. అవినీతి అన్నది రాజకీయ నాయకుల హక్కుగా మారింది. ప్రజలను ఏమార్చి, అధికారం చేపట్టగానే, ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప దేశహితం, దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లేందుకు అసవరమైన నిర్ణయాలు తక్కువే జరుగుతున్నాయి. ఇటీవల రామమందిరంలో విరాళాల చోరీ ఘటన తెలిసిందే. అవినీతి కేసుల్లో దోషులకు మరణశిక్ష విధించాలి. అవినీతి సాధారణమేనని సగటు భారత పౌరులు ఆలోచించే పరిస్థితి నెలకొన్నది. దొరికే వరకు కూడా ఇది తప్పు అని కూడా భావించడంలేదు. వ్యవస్థలో అవినీతిని రూపుమాపాలని ప్రభుత్వం నిజంగా భావిస్తే, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాన్ని సవరించాలి. దోషులకు మరణ శిక్ష విధించేలా మార్పులు చేయాలి. ఉన్న చట్టాలతోనే కఠిన శిక్షలు విధించాలి. ఇకపోతే దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందనడంలో ఎలాంటి



సందేహం అక్కర్లేదు. గత పదేళ్లలో ఏకంగా 152 పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సగటున నెలకు ఒక పేపర్ లీక్ అవుతున్నా బాధ్యులైన వారికి పడిన శిక్షలు మాత్రం సున్నా అని ధ్వజమెత్తారు. నిజంగానే ఇది ముమ్మాటికీ నిజం. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడానికి ముందే ప్రధాని మోడీ పార్లమెంటులో స్పందించి ఉంటే ఈ గందరగోళం చెలరేగేది కాదు. ప్రతి ఆందోళనను రాజకీయ కోణంలో చూడడం, విపక్షాలను తిట్టిపోయడం వల్ల సమస్యలను పాలకులు గుర్తించడం లేదు. ఒకప్పుడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన భారత విద్యా వ్యవస్థ.. అక్రమాలు, లీకేజీలకు నిలయంగా మారింది. దేశంలో పేపర్ లీకేజీలు ఒక పెద్ద మాఫియాగా మారాయి. దీని వెనుక ఉన్న బడాబాబులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతూ వస్తోంది. జంతర్ మంతర్ వద్ద భారతీయ యువత నిరసనలను సీరియస్‌గా తీసుకోవాల్సి ఉండగా, దానిని అణచివేయడం ఎలా అన్న ఆలోచననే అధికారపక్షం ఆలోచన చేయడం సరికాదు. నిరసనల్లో లక్ష మందికి పైగా యువకులు, విద్యార్థులు పాల్గొని ఉంటారని ఫోటోలు స్పష్టంగా సూచిస్తున్నాయి. తొలుత ఒక మార్చ్‌గా అనుకున్నది తరువాత నిరసన ప్రదర్శనగా పరిణమించింది. ఎంతోకాలంగా ఆగ్రహంతో ఉన్న యువత ఈ అవకాశాన్ని అనుకూలంగా తీసుకుని, వెల్లువెత్తి జనసంద్రంగా మారినట్లు మనకు కనిపిస్తోంది. మన దేశంలో రాజకీయ పార్టీల ర్యాలీలకు డబ్బులు, ఇతర ప్రలోభాలతో జనాన్ని సమీకరించడం పరిపాటి. అయితే ఈ నిరసన ప్రదర్శన అలా జరగలేదు. జంతర్ మంతర్‌కు చేరిన వారందరూ తమకు తాముగా స్వచ్ఛందంగా వచ్చినవారే. ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాలలో విజ్ఞప్తులకు ప్రతిస్పందించి స్వచ్ఛందంగా వచ్చినవారే. ఎవరి ప్రయాణ ఏర్పాట్లు వారే చేసుకుని, సుదూర ప్రాంతాల నుంచి నడిచి వచ్చినవారు చాలామంది ఉన్నారు. ఇంకో ముఖ్య విషయమేమంటే వచ్చిన వారిలో యువ మహిళల శాతం అత్యధికంగా ఉండడం. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నవారిలో అత్యధికులు ఇటువంటి నిరసనలలో తొలిసారి పాల్గొన్నవారే కావడం మరో వాస్తవం. కేవలం నీట్ తదితర ప్రశ్నపత్రాల లీక్‌కు రగిలిపోయి మాత్రమే యువత జంతర్ మంతర్ వద్ద ధర్నాకు రాలేదని ఖచ్చితంగా చెప్పవచ్చు. దేశంలో పెచ్చరిల్లు తోన్న నిరుద్యోగం, అవినీతిమయమైన అధికార వ్యవస్థలు, రాజకీయ పార్టీల కపటాలు అన్నీ కలగలిపి వారిని ఈ నిరసనలో పాల్గొనేలా ప్రోత్సహించాయనే చెప్పాలి. విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకుని ఉద్యోగాలను వెతుక్కుంటున్న వారు, నియామకాలలో అవకతవకలకు బాధితులైనవారు ఎందరో ఆ నిరసనకారుల్లో ఉన్నారని చెప్పక తప్పదు. దేశ పాలనావ్యవస్థల్లో అవినీతి మితిమీరి, రాజకీయ అవినీతి పెరిగి పోవడం, పాలకుల విలాసాలు, ప్రజలేమో అవస్థల పాలవుతున్న తీరు కారణంగా యువత నిరసనలకు ఉద్యమించిందని చెప్పక తప్పదు. దీనికి విదేశీ హస్తం ఉందనో లేదా మరే ఇతర కారణాలనో చూపి మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు కూడా మంచిది కాదు. సమస్యలను గుర్తించి పాలకలు తమ తీరును మార్చుకోవాలి. ఇది కేంద్ర రాష్ట్రాల పాలకలుకు ఓ హెచ్చరిక కావాలి. అలాగే ఈ యువ నిరసన ఒక ఆరంభం మాత్రమే. ఇది దావానలంలా విస్తరించినా ఆశ్చర్య పోనవసరం లేదు. పాలకులు బుద్ధి తెచ్చుకుని మారకపోతే యువత చరిత్ర సృష్టిస్తుందని చెప్పక తప్పదు.

## వర్షపు నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### జల్ సంచయ్ జన్ భాగిధారి 3.0 కార్యక్రమంలో ప్రజలకు పిలుపు




**వైరా/జులై 23(జర్నలిస్ట్ వార్త)):** వర్షపు నీటి సంరక్షణను ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా భావించి ముందుకు రావాలని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ మేడూరి రామచంద్రరావు పిలుపునిచ్చారు.భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న జల్ సంచయ్ జన్ భాగిధారి (జేఎస్‌జేబీ) 3.0 కార్యక్రమంలో భాగంగా గురువారం వైరా మున్సిపాలిటీ 6వ వార్డు, మధిర రోడ్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వర్షపు నీటి వృథాను అరికట్టి, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పెంపు, చెరువుల పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణకు ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ప్రతి నీటి బొట్టును ఆదా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువత స్వచ్ఛందంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సుధీర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ బి. వెంకట్రావు, మెప్మా ఆర్పీ ఫాతిమా, వార్డు ప్రజలు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## నందమూరి రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు

### ఖమ్మం టీడీపీ నేత వనమా వాసు మర్యాదపూర్వక భేటీ






**ఖమ్మం,/ జూలై 23 (జర్నలిస్ట్ వార్త):** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు తనయుడు నందమూరి రామకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని టీడీపీ ఖమ్మం జిల్లా నాయకుడు వనమా వాసు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించిన వనమా వాసు మాట్లాడుతూ.. నందమూరి రామకృష్ణ తన తండ్రి ఎన్టీఆర్ ఆశయాలను అనుసరిస్తూ, పార్టీ కార్యకర్తలు, అభిమానులతో నిరంతరం మమేకమవుతున్నారని అన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ అభిమానుల ఆహ్వానం మేరకు తెలుగు రాష్ట్రాల్లో పర్యటిస్తూ పార్టీ కార్యకర్తలకు అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ ఖమ్మం జిల్లా నాయకులు, తెలుగు యువత నాయకుడు నున్నా నవీన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## నీట్‌పై విద్యార్థుల ఆక్రందన సబబే

### దానికి సానుకూలంగా స్పందించాల్సిందే -ప్రభుత్వ విధానాలను తూర్పారా బట్టిన కమల్ హాసన్

**న్యూఢిల్లీ,జులై 23(జర్నలిస్ట్ వార్త)):**
ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలకు ప్రముఖ నటుడు, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ మద్దతు ప్రకటించారు. విద్యార్థుల ఆందోళనలపై స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. 'ఒక బిడ్డ ఏడ్చినప్పుడే మనం వినాల్సింది. కానీ ఎంతోమంది పిల్లలు ప్రాణాలు కోల్పోయే వరకు వేచి చూశాం. నేర్చుకోవడం స్థానంలో శిక్షణ, జిజ్ఞాస స్థానంలో ఆందోళన, ప్రతిభ స్థానంలో నేర ప్రవృత్తి చోటుచేసుకుంది. ఇది కుళ్లిపోయిన వ్యవస్థ' అని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు సమాధానాలు, అవకాశాలు అందించాల్సిన వ్యవస్థ వారిని అడ్డంకులు, ఒత్తిళ్లు, నిరాశల వైపు నెట్టివేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'పిల్లలకు సమాధానాల బదులుగా




అడ్డంకులు, లాఠీలు ఎదురైతే అది ఒక దేశ వైఫల్యానికి సంకేతం' అని పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త, విద్యా సంస్కరణల కోసం పోరాడుతున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను ఉద్దేశించి కమల్ హాసన్ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. 'దేశానికి రాబోయే ప్రయాణంలో మీ అవసరం ఉంది. దయచేసి మీ నిరాహార దీక్షను విరమించండి' అంటూ కోరారు.అదేవిధంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన భావోద్వేగ సందేశం ఇచ్చారు. 'భారతదేశ బిడ్డలారా.. మీరే మాలో ఉత్తములు. మీరు మీ కర్తవ్యాన్ని నెరవేర్చారు. ఇప్పుడు దేశం మీకు తన కర్తవ్యాన్ని నెరవేర్చాల్సిన సమయం వచ్చింది. మీ కలలు ఎల్లప్పుడూ మా వైఫల్యాల కన్నా ఉన్నతంగా నిలవాలి' అని పేర్కొన్నారు.
జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న నీట్ వ్యతిరేక నిరసనలకు రాజకీయ, సామాజిక వర్గాల నుంచి మద్దతు పెరుగుతున్న నేపథ్యంలో కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు, విద్యావిధానం, ప్రవేశ పరీక్షలపై జాతీయ స్థాయిలో చర్చ మళ్లీ వేడెక్కుతోంది.

## శాస్త్రీయ అధ్యయనాల ఈ20 తర్వాతే నిర్ణయం

**పెట్రోల్‌లో 20 శాతానికి మించి ఇథనాల్..?**

**ఈ85 ఇంధనం ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలకే**

**ఈ20 వల్ల ఇంజిన్ సమస్యలకు ఆధారాలు లేవన్న సురేశ్ గోపీ**

**20 కోట్ల ద్విచక్ర వాహనాలు, 3 కోట్ల కార్లు ఈ20పై నడుస్తున్నట్లు వెల్లడి**

**ఈ20తో కాలుష్యం తగ్గి పనితీరు మెరుగుపడుతుందని స్పష్టీకరణ**



**జులై 23(జర్నలిస్ట్ వార్త)):**
పెట్రోల్‌లో ప్రస్తుతం అమల్లో ఉన్న 20 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని మరింత పెంచే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిపై భవిష్యత్తులో నిర్ణయం తీసుకునే ముందు శాస్త్రీయ అధ్యయనాలు, సాంకేతిక పరిశీలనలు, అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపింది.లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆటోమొబైల్ తయారీ సంస్థలు, చమురు మార్కెటింగ్ కంపెనీలు, పరిశోధనా సంస్థలతో సంప్రదింపులు జరిపిన తర్వాతే తదుపరి నిర్ణయం ఉంటుందని పేర్కొన్నారు.85 శాతం ఇథనాల్, 15 శాతం పెట్రోల్‌తో కూడిన 'ఈ85' ఇంధనాన్ని కేవలం ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల కోసం మాత్రమే ప్రవేశపెట్టామని, ఇది దేశవ్యాప్తంగా పెట్రోల్‌లో ఇథనాల్ శాతాన్ని పెంచినట్లు కాదని మంత్రి వివరణ ఇచ్చారు. భారత్‌లో ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ కార్యక్రమాన్ని నీతి ఆయోగ్, ఏఆర్ఏఐ, సియామ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, చమురు సంస్థలు తదితర సంస్థల సలహాలతో శాస్త్రీయంగా అమలు చేస్తున్నామని తెలిపారు.దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకుపైగా పెట్రోల్ కార్లు 'ఈ20' ఇంధనాన్ని వినియోగిస్తున్నప్పటికీ, ఇథనాల్ కారణంగా ఇంజిన్ దెబ్బతిన్నట్లు లేదా అసాధారణ సమస్యలు తలెత్తినట్లు ఎలాంటి నిర్ధారిత ఆధారాలు లేవని కేంద్రం వెల్లడించింది. వాహన తయారీ సంస్థలు కూడా ఈ20 వాడుతున్న వాహనాలకు వారంటీ కొనసాగిస్తున్నాయని పేర్కొంది.ఈ20 ఇంధనం వల్ల కొంతమంది పాత వాహనాల్లో ఇంధన సామర్థ్యం 3 నుంచి 5 శాతం వరకు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, మెరుగైన దహన ప్రక్రియ, తక్కువ కాలుష్యం, మంచి యాక్సిలరేషన్ వంటి ప్రయోజనాలు ఉన్నాయని మంత్రి తెలిపారు.ఇథనాల్ మిశ్రమ కార్యక్రమం వల్ల ఇప్పటివరకు రూ. 1.97 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా కావడంతో పాటు 316 లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురు దిగుమతులు తగ్గాయని తెలిపారు. 952 లక్షల మెట్రిక్ టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు రైతులకు రూ. 1.66 లక్షల కోట్లకు పైగా ఆదాయం చేరిందని కేంద్రం వెల్లడించింది.

## తిరుమలపై ఆంజనేయస్వామి విగ్రహ చోరీ కేసును 24 గంటల్లోనే ఛేదించిన పోలీసులు..

**మంత్రి ఆనం అభినందనలు**

**తిరుమల ఘాట్ రోడ్డులోని 7వ మైలు వద్ద విగ్రహ అపహరణ**

**24 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న పోలీసులు**

**దేవాలయాల వద్ద భద్రతను పటిష్ఠం చేయాలని ఆనం ఆదేశాలు**



తిరుమల ఘాట్ రోడ్డులోని 7వ మైలు వద్ద చోటుచేసుకున్న ఆంజనేయస్వామి విగ్రహ అపహరణ కేసును కేవలం 24 గంటల్లోనే ఛేదించిన తిరుపతి జిల్లా పోలీసులను ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రశంసించారు. పక్కా ప్రణాళికతో వేగవంతమైన దర్యాప్తు జరిపి నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో పాటు, స్వామివారి విగ్రహాన్ని సురక్షితంగా స్వాధీనం చేసుకోవడం పోలీసుల సమర్థతకు, అంకితభావానికి నిదర్శనమని ఆయన కొనియాడారు.తిరుమల వంటి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రాల్లో భద్రతా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి అన్నారు. తిరుమలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన దేవాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లను తక్షణమే పటిష్ఠం చేయాలని సంబంధిత దేవాదాయ, పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణాల్లో సీసీటీవీ నిఘాను నిరంతరం పర్యవేక్షించాలని, భద్రతా సిబ్బంది గస్తీని పెంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని చెప్పారు.
దేవతా విగ్రహాలను అపహరించడం లేదా ఆలయ ఆస్తులు, సెంటిమెంట్లతో ఆడుకునే దుశ్చర్యలకు పాల్పడే వారిపై కూటమి ప్రభుత్వం అత్యంత కఠినమైన వైఖరిని అవలంబిస్తుందని మంత్రి హెచ్చరించారు. కోట్ల మంది భక్తుల నమ్మకాలకు, భావోద్వేగాలకు భంగం కలిగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని తేల్చిచెప్పారు. భవిష్యత్తులో ఏ పుణ్యక్షేత్రంలోనూ ఇలాంటి అపచారాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.